


> ***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యానబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

## రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే

## *చివరి విడత: మలి సందడి (2)*

**అమ్మో, నిన్న!** (ఇండియా–జర్మనీ శ్రీమతి ప్రయాణ విశేషాలు – ఆమె మాటల్లోనే)

కొన్నాళ్లు అత్తింట్లో ఉన్నాను.

కొన్నాళ్లు పుట్టింట్లో ఉన్నాను.

కొన్నాళ్లు అక్కా బావల దగ్గర ఉన్నాను.

అంతా నావాళ్లే! కానీ పక్కన మీరు లేకపోతే – అంతా పరాయివాళ్లేననిపించింది.

పరాయింట ఉన్నానన్న భావం మనసులో రాకూడదు కానీ – వస్తే అది నరకమే!

ఆ అనుభూతి కేవలం మానసికమని తెలుసు. కానీ పెళ్లయి కాపురానికి వచ్చిన మరుక్షణంనుంచీ, అదేమిటో మీరు తప్ప నావాళ్లంటూ ఎవరూ లేరనిపించింది.

పిల్లలు పుట్టేక – మనం అంటే – మీరు, నేను, మన పిల్లలు మాత్రమే అనిపించింది.

చిత్రమేమిటంటే – అలా అనిపించిన విషయం మీరు నాకు దూరంగా వెళ్లేదాకా తెలియలేదు.

సామాన్య పౌరులకి సంబంధించినంతవరకూ – బ్రిటిష్ వాళ్ల ఏలుబడికీ, మన ఏలుబడికీ పెద్దగా తేడా ఏముండదు. ఆంక్షలు, నియమాలు ఏదో రూపంలో వాళ్లని అదుపు చేస్తూనే ఉంటాయి. కానీ మనవాళ్లు మనకి ఏలికలైనప్పుడే మనది స్వతంత్రభారత దేశం.

అప్పుడొచ్చిన లోటేమిటీ, ఇప్పుడు కొత్తగా ఒరిగిందేమిటీ అనుకునేవారు ఇప్పటికీ ఉన్నారు.

అదెంతవరకూ సబబో చెప్పలేను కానీ – నాకు మాత్రం భార్యాభర్తలు కలిసి ఒకచోట ఉన్నప్పుడు మాత్రమే వాళ్లది స్వతంత్ర జీవనం అనిపిస్తుంది. ఇద్దరూ చెరో చోటా గడపాల్సి వస్తే – అది ఆర్థికంగా ఎన్ని సౌకర్యాలు కలగజేసినా – స్వతంత్ర జీవనం అనిపించుకోదు.

చిన్న ఉదాహరణ.

మీరు ప్రతి బుధవారం రాత్రి 8కి బినాకా గీత్‌మాలా వింటారు. అందులో వచ్చిన పాటల జాబితా పుస్తకంలో రాసుకుంటారు. ఇది మీకు ఈనాటి అలవాటు కాదు.

1959నుంచి మీ దగ్గర ఏటా 52 వారాల బినాకా గీత్‌మాలా పాటల రికార్డు ఉంది. రీసెర్చిలో చేరినప్పుడు బినాకా పాటలు మిస్ కాకూడదనే – మీరు అన్ని ఖర్చులూ మానుకుని ముందు రేడియో ఒకటి కొనుక్కున్నారని తెలుసు. జర్మనీ వెళ్లేక బినాకా పాటల జాబితా రాసుకునే పని నాకు అప్పగించారు. నా బాధ్యతని సక్రమంగా నిర్వహించాలనే ప్రయత్నిస్తున్నాను.

కానీ – పుట్టింటైనా అత్తింటైనా ఉన్నది ఒకే రేడియో. పిల్లలు వాడుకునేటప్పుడు నేనది కాసేపైనా స్వాధీనం చేసుకోగలను. కానీ పెద్దవాళ్లనుంచి కుదరదు కదా!

పోనీ విషయాన్ని వాళ్లకి వివరిద్దామంటే – మనం తీసుకున్నట్లు వాళ్లు దాన్ని సీరియస్‌గా తీసుకోరు.

అలా ఎన్నో వారాలు బినాకా వినడం మిస్సయ్యాను. ప్రతివారం ఎలాగూ కుదరడం లేదు – కనీసం ఏడాది చివర్లో ప్రత్యేకంగా వచ్చే వార్షిక కార్యక్రమం తప్పక వ్రాద్దామనుకున్నాను. అందులో ఆ ఏడాది మేటి పాటలు వస్తాయి కాబట్టి మీకు కొంత తృప్తి అనుకున్నాను.

అక్కాబావల ఇంట్లో ఉన్నాను కాబట్టి ఇక్కడ ఆ మాత్రం స్వతంత్రం తీసుకోగలను అనుకున్నాను. పాపం, ఈ విషయంలో బావ కూడా నన్నర్థం చేసుకుని పాటల జాబితా వ్రాయడంలో తను కూడా నాకు సహకరిస్తానన్నాడు.

కానీ ఆ రోజు సరిగ్గా ఆ కార్యక్రమం మొదలయ్యే సమయానికి ఇంటికి బావ మిత్రులు వచ్చారు. వచ్చింది కూడా మమ్మల్ని పలకరించడానికి.

వాళ్లు మమ్మల్ని చూసి – "మీవాడు వీళ్లని తీసుకెళ్లడానికి అంత ఖర్చుకు సిద్ధపడ్డంలో ఆశ్చర్యం లేదు. ఇంత స్వీటు భార్యనీ, పిల్లల్నీ వదిలి ఇన్నాళ్లుండడమే ఆశ్చర్యం" అని మాకు కాంప్లిమెంట్సు కూడా ఇచ్చారు.

మిస్సవుతున్న బినాకా పాటలే చెవుల్లో రింగుమంటూండడంవల్ల వాళ్ల ప్రశంసలు నన్నంతగా కదిలించలేదు.

అలాగని పాపం వాళ్లూ ఎక్కువసేపు ఉండలేదు. గంట కార్యక్రమంలో ఓ పావుగంట మిస్సయ్యాను. బావ నొచ్చుకోవడమే కాక మిగతా పాటలు వ్రాసుకోవడంలో సాయం చేశాడు.

మీరు వెళ్లేక ఇలాంటివి చాలానే జరిగాయి.

మన దాంపత్యం మన సామ్రాజ్యం. ఇద్దరిలో ఎవరు లేకున్నా ఆ సామ్రాజ్యం వెలవెలబోతుంది.

అందుకే ప్రతి క్షణం ఓ యుగంలా గడుస్తుంటే – రోజులు, వారాలు, నెలలు, ఏళ్లు ఎలా గడపాలా అన్న భావనే నరకంగా మారి నన్ను వేధించేది.

అలాంటి సమయంలో మమ్మల్ని జర్మనీ తీసుకుని వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మీనుంచి ఉత్తరం.

మన పరిస్థితులు తెలుసు కాబట్టి అలాంటి ఏర్పాటుకి అవకాశముండొచ్చన్న ఆశ నాలో ఏమాత్రం లేదు.

మీ ఉత్తరం చదివితే కలా, నిజమా అనిపించింది. తర్వాత విమానప్రయాణం మాటెలాగున్నా ముందు అప్పుడే గాల్లో తేలిపోయి, ఆ ఉత్తరం ఒకటికి రెండుసార్లు చదువుకున్నాను.

అప్పుడు మీమీద కలిగిన ప్రేమాభిమానాల్లో కృతజ్ఞత కూడా చోటు చేసుకోవడం మీకు విచిత్రంగా అనిపించొచ్చు. కానీ అది నిజం.

విదేశానికి వెళ్లడం, అదీ జర్మనీ వంటి ఆధునిక సంపన్న దేశానికి వెళ్లడం – గర్వపడాల్సిన విషయం. కానీ అప్పుడు నాలో అలాంటి అనుభూతులు లేవు. ఎక్కడో ఒకచోట – మనమిద్దరం కలిసుంటాం అన్న భావనే నా సంతోషానికి ఏకైక కారణం.

అప్పుడు నేను కలకత్తాలో అక్కా బావల దగ్గర ఉన్నానుగా. వాళ్లు నన్నెంతో బాగా చూసుకుంటున్నారు. కానీ – వాళ్లూ జీవనభృతికోసం స్వరాష్ట్రాన్ని వదిలినవాళ్లే కదా!

బావది రిజర్వు బ్యాంకులో పెద్ద ఉద్యోగం. ఆఫీసుకి వెళ్లిరావడమే ఓ పెద్ద పని. ఆపైన పెద్ద ఆఫీసరుగా ఉద్యోగ బాధ్యతలు.

అక్కకి సంసార బాధ్యతలు. ఆపైన కలకత్తా ఓ మహానగరం. ఏం కావాలన్నా ఏంచెయ్యాలన్నా మహా ప్రయత్నమే చెయ్యాలి. తమ పనులకే ఇతరుల సాయం కావాలి వాళ్లకి. అలాంటి వాళ్ల మధ్యకి నేనొచ్చాను.

పోనీ, వాళ్లకి చేదోడువాదోడుగా ఉంటే అదో తృప్తి. కానీ అప్పుడు నాకే వాళ్ల సాయం కావాలి. అదీ మామూలు సాయమా – పాస్‌పోర్టు తీసుకోవాలి. విదేశప్రయాణానికి ఏర్పాట్లు చెయ్యాలి. ట్రయిన్ టికెట్లు బుక్ చెయ్యాలి. విమానం ఎక్కించాలి. ఈ పనులన్నింటికీ సమయం కేటాయించాలి.

మన పని మనం చేసుకుందుకు మన పద్ధతి మనకుంటుంది. ఇతరులకి అప్పగించినప్పుడు వాళ్ల పద్ధతిలో వాళ్లు చేస్తారు కానీ మన పద్ధతిలో చెయ్యరు. పనౌతుంది కానీ పద్ధతులు వేరవడంవల్ల మనలో ఆదుర్దా ఎక్కువుంటుంది.

బావ ఏ పనైనా పీకెలమీదకు వచ్చేదాకా చెయ్యడు. కానీ పనౌతుంది. నాకేమో కంగారు. పనెంతవరకూ వచ్చిందో, అనుకున్నవేళకు ఔతుందో అవదో అని బెంగగా ఉంటుంది. పదేపదే అడిగితే బాగుండదు. తను ఎప్పటికప్పుడు చెప్పడు.

అనుకున్న పని అనుకున్న వేళకు జరక్కపోవడమన్నది అక్క, బావల జీవితంలో లేదు. అందుకని వాళ్లు నిశ్చింతగా తమ పద్ధతుల్ని కొనసాగిస్తున్నారు. వాళ్లని కాస్త హెచ్చరిద్దామంటే – ఇద్దరూ నాకంటే పెద్దవాళ్లు. పెద్దరికం బాధ్యతల్ని ఇవ్వడమే కాదు – ప్రశ్నలకి అతీతమూ ఔతుంది – ముఖ్యంగా మన సంప్రదాయంలో.

అదీకాక ఇది డబ్బుకి తడుముకునే సమయం కాదు. వాళ్లవేమో ఇంకా లేత రెక్కలు. నేనేమో భర్త దగ్గర లేని గృహిణిని.

డబ్బు గురించి నేను వాళ్లకి హామీ లివ్వలేను. వాళ్లేమో తమ డబ్బు ఇబ్బందుల్ని నాకు చెప్పుకోలేరు.

అప్పటికీ మీరు భువనేశ్వర్నించి నాకు డబ్బందే ఏర్పాటు చేశారు. మీ మిత్రుడు అయిదొందలు పంపితే, సరిపోవన్నానని – ఆ తర్వాత మరో రెండొందలు కూడా పంపే ఏర్పాటు చేశారు. అవీ సరిపోవని చెప్పడం ఇబ్బందే కదా!

ఉన్నంతలో మేం ముగ్గురం బూట్లు కొనుక్కున్నాం. మొత్తం అరవై రూపాయలయింది. ప్రయాణానికి ఓ పెద్ద పెట్టి కొన్నాను. 135 రూపాయలు. పిల్లలకి మఫ్లర్సు పాతిక రూపాయలు. మీరు అక్కడి వాళ్లకివ్వడానికని మంచిగంధం బొమ్మలు – బాల్‌పెన్ను, చిన్న ఏనుగులు లాంటివి కొన్ని తీసుకున్నాను. 22 రూపాయలు. తాజమహల్ ఒకటి కొందామనుకున్నాను కానీ ఢిల్లీలో ఐతే కాస్త చౌకగానూ, మంచివీ దొరుకుతాయన్నాడు బావ. అప్పుడు టైము సరిపోతుందా అందామనుకున్నాను కానీ – ఇప్పుడు డబ్బు సరిపోతుందా అన్న అనుమానం ఉండడంవల్ల – మరి మాట్లాడలేదు.

దూర ప్రయాణం. సామాను మనతో కూడా ఉండదు. మిస్సయ్యే ప్రమాదముందని – పెట్టెమీద పెద్ద అక్షరాలతో నా పేరు ప్రత్యేకంగా వ్రాయించాడు బావ.

ఇంకా ఈ ప్రయాణం చేసేముందు యెల్లో ఫీవర్ రాకుండా టీకాలు వేయించుకోవాలిట. కానీ టీకాలు వేయించుకుంటే జ్వరమొస్తుందనీ, అది తగ్గడానికి ఒకోసారి వారం పైన పట్టొచ్చనీ కొందరన్నారు. మాకున్న వ్యవధి తక్కువ. ఏంచెయ్యాలా అని బెంగపడ్డాను కానీ – మన దేశంలో శతకోటి దరిద్రాలున్నట్లే వాటికి అనంతకోటి ఉపాయాలూ ఉన్నాయి.

టీకాలు వేయించుకోవడం ముఖ్యం కాదుట. వేయించుకున్నట్లు సర్టిఫికెట్ ఉండాలిట, అంతే! ఒక ఏజంటు పది రూపాయలు తీసుకుని – మా ముగ్గురికీ టీకాల సర్టిఫికెట్లు ఇప్పించేశాడు. సర్టిఫికెట్లు ఇలా కూడా వస్తాయని తెలియని దేశానికి వెడుతున్నాం కాబట్టి అలా ఆ పనైపోయింది.

ఇదిలా ఉండగా – టికెట్లు పంపుతున్నట్లు మీనుంచి ఇలా సమాచారం అందగానే అలా బావ నా ప్రయాణం గురించి మా నాన్నగారికి టెలిగ్రాం ఇచ్చాడు.

మా నాన్నగారి సంగతి మీకు తెలుసుగా – ఆవులించబోయే వాళ్లతో, 'అనవసరంగా శ్రమ పడకండి. మీ పేగుల లెక్క నాకు తెలుసు' అనగల అవగాహన ఆయనది.

ఆయనకు మొత్తం పరిస్థితి ఆకళింపుకి వచ్చినట్లుంది. తను బయల్దేరి వస్తున్నానని ఉత్తరం వ్రాసి దాంతోనే ముందుగా మూడు వేల రూపాయలకి డ్రాఫ్టు కూడా పంపారు. దాంతోపాటే ఓ ఉత్తరం కూడా ఉంది. 'ఈ డబ్బు మీ తక్షణ అవసరాలకిగానూ తెలిసినవారి దగ్గర చేబదులు తీసుకుని పంపుతున్నాను. దేనికీ వెనుకాడకుండా దర్జాగా షాపింగు చెయ్యండి. చేబదులు కాబట్టి – బాకీ తీర్చేటప్పుడు మీరు వడ్డీ కట్టక్కర్లేదు. వీలునిబట్టి నేను కూడా మధ్యమధ్య చెల్లు వేస్తుంటాను కాబట్టి – తీర్చడానికి మీరు ఎంత టైమైనా తీసుకోవచ్చు' అన్నది ఆ ఉత్తరంలోని సారాంశం.

తీసుకుందుకు ఇబ్బంది పడతామని – ఆయన దాన్ని అప్పు అన్నారు. ఎదుటివాళ్ల అవసరాలు తీర్చేటప్పుడు వారా సాయాన్ని ఆమోదించడానికి సహకరించే భాషనే వాడ్డం ఆయన ప్రత్యేకత. ఆయన ఆ డబ్బు అప్పుగా ఇచ్చారనుకోను. మనం వెనక్కిచ్చినా – బాకీ తీర్చినట్లు కాకుండా ఆయన పద్ధతిలోనే మరో విధంగా ఇవ్వాల్సి ఉంటుంది.

ఏది ఏమైనా – ఆ డబ్బు అప్పుడు మనకి చాలా అవసరం. చేతికి అందగానే ఇంటిల్లపాది మనసులూ తేలికైపోయాయి. ఉన్న ఖర్చులకిది గొప్ప వెసులుబాటు. ఇప్పుడు నేను ధైర్యంగా అక్కకి చెప్పగలను – 'మా పనిమీద ఢిల్లీ వస్తున్నారు కాబట్టి మీ రైలు ప్రయాణం ఖర్చులు నావే' అని.

ఆ డబ్బు అందగానే ముందు పిల్లలిద్దరికీ ఉలెన్ గుడ్డలు కొని చెరో సూటూ కుట్టించాను. కుట్టుకూలితో కలిపి 330 రూపాయలయింది.

డ్రాఫ్టు మాకు డిసెంబరు 28న అందింది. అమ్మా, నాన్నా – డిసెంబర్ 30న వచ్చారు. నన్ను వాళ్లే ఢిల్లీ తీసుకెళ్లి విమానం ఎక్కిస్తారు కాబోలని ముందు అనుకున్నాను. కానీ నాన్న ఆ బాధ్యతని అక్కాబావలకే వదిలిపెట్టారు.

అప్పుడర్థమైంది – ఆయనొచ్చింది కేవలం నాకు ధైర్యం చెప్పడం కోసమని.

అమ్మానాన్నలంటే అంతే మరి! కన్నకూతురికి అవసరమైన డబ్బు పంపారు. మాటల్లో ధైర్యంచెప్పడానికి కాకినాడనుంచి కలకత్తా వచ్చారు.

నాన్న ముందొకసారి అంతవరకూ జరిగిన ఏర్పాట్లు సమీక్షించారు. నేను కొనుక్కున్న షాల్ చూసి – "అబ్బే – ఇది చౌకరకం. మన దేశంలోనే చలి ఆపదు. ఇక అక్కడేం అక్కరకొస్తుంది" అంటూ అది అమ్మకి ఇప్పించి, నాకు మరో ఉలెన్ షాల్ కొన్నారు.

ఆ షాల్ నాకోసం ఎంపిక చేసింది బావ. అందుకని వీలు చిక్కగానే, "పెద్ద – ఎంఏ అంటారు. రిజర్వు బ్యాంకులో ఆఫీసరు అంటారు కానీ – జర్మనీ వెళ్లడానికి ఎలాంటి షాల్ కొనాలో కూడా మా నాన్నగారు చెప్పాలి" అని అక్క బావని ఎద్దేవా చేసింది.

ఇలాంటి విషయాల్లో ఎదురు సమాధానానికి బావ ఏమాత్రం తక్కువ తినడు – "అసలు విషయం నీకు అర్థం కాలేదు. నేను కొన్న షాల్ మీ నాన్నగారికి ఎంత నచ్చేసిందంటే – దాన్ని అత్తయ్యగారికోసం ఉంచెయ్యాలనుకున్నారు. వయసులో పెద్దవారు – ఆ మాట పైకి చెప్పలేరు కదా – అందుకని...." అన్నాడు.

ఐతే నాన్న కొత్త షాల్‌కి కూడా అంతగా తృప్తి పడలేదు. షాల్ పైన కప్పుకుందుకు రగ్గు ఒకటి కొని, "ఇది చలి బాగా ఆపుతుంది. కాస్త గుచ్చుకుంటుంది కాబట్టి లోపల షాల్. డబల్ ప్రొటెక్షన్" అన్నారు.

నాన్న దగ్గరుండి నాకోసం ప్రత్యేకంగా షూ ఒకటి కొన్నారు. అది నల్లగా నిగనిగలాడుతూ మెరిసిపోతోంది. అడుగున సోల్ చాలా నున్నగా ఉంది.

"ఇది రాజులు వేసుకునేలాంటిదమ్మా! జర్మనీ వెడుతున్నావుగా – నీదిక రాజయోగమే!" అన్నారాయన.

ఆయన నాకు విదేశయానం గురించి చాలా చెప్పారు. కొన్ని తెలిసినవారి ద్వారా విన్నవి. కొంత చదివిన పరిజ్ఞానం.

పక్కనున్నవాళ్లకి చాదస్తంగా అనిపించొచ్చు కానీ – ఆయన మాటల్లో నాకు మాత్రం పితృప్రేమకి నిర్వచనం కనిపించింది.

నిత్య జీవన వ్యవహారంలో అవసరపడే ఆంగ్ల పదాల జాబితా ఒకటి కాకినాడలోనే తయారు చేసుకుని వచ్చారాయన. నన్నూ మా అక్కనీ పిలిచి ఆ జాబితాని కంఠస్థం చేయించారు. స్కూలు టీచర్లా మాచేత వల్లె వేయించారు. అడ్డదిడ్డపు వరుసలో అర్థాలడిగి మాకవి వంటబట్టినట్లు నిర్ధారించుకున్నాక – "ఒకసారి మీరిద్దరూ ఇంగ్లీషులో మాట్లాడుకోండి" అన్నారు.

కొంత మొహమాటం. కొంత చిరాకు. కానీ నాన్నగారంటే భయం, భక్తి, గౌరవం మూడూ ఉన్నాయి మాకు.

కన్యాశుల్కం నాటకంలో గిరీశం, వెంకటేశంలా మేమిద్దరం కాసేపు 'ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్' చెప్పుకున్నాం.

నాన్నగారు ముసిముసిగా నవ్వారు. మాచేత మాట్లాడించడంలో ఆయన కాసేపు మాలోని బాల్యాన్ని వెలికి తీసి వినోదించారని అప్పుడు నాకనిపించింది.

అమ్మ, నాన్నగారు కలకత్తాలో రెండ్రోజులే ఉన్నారు. జనవరి 1న కాకినాడకి వెళ్లిపోతున్నామని చెప్పగానే – "ఇక్కడ రిజర్వుబ్యాంకులో ఎస్కలేటర్ (కదిలే మెట్లు) పెద్ద టూరిస్ట్ ఎట్రాక్షన్. క్రితంసారి వచ్చినప్పుడు కూడా మీరు చూడలేదు. మీరొస్తారనే – ఇంతవరకూ మీ చిన్నమ్మాయికి కూడా అవి చూపించలేదు" అన్నాడు బావ.

నాన్న నవ్వి, "చిన్నమ్మాయి గురించైతే ఇకమీదట జర్మనీలో రోజూ షాపుల్లో ఎస్కలేటర్లు ఎక్కుతూనే ఉంటుందిలే. నా సంగతంటావా – అవతల చాలా పనులు పక్కనపెట్టి వచ్చాను. ఎస్కలేటరంటే మామూలు విశేషమా – అదో పెద్ద వింత! తీరుబడిగా శ్రద్ధగా చూడాలి. దాని గురించి మనూళ్లోవాళ్లకి కాస్త వివరంగా చెప్పాలి. మళ్లీ వచ్చినప్పుడు కేవలం అది చూడ్డానికే వస్తాను" అన్నారు.

వ్యవసాయం పనులమీద పల్లెటూరికి వెళ్లినప్పుడల్లా నాన్న తన చుట్టూ చేరినవారందరికీ – ఊసులు చెబుతారు. వాటిలో దేశ విదేశాలకి సంబంధించిన వింతలు, విడ్డూరాలు ఉంటాయి. చెప్పడం ఆయనకిష్టం. వినడం వాళ్లకిష్టం.

బావ మరి బలవంత పెట్టలేదు ఆయన్ని.

అమ్మనుంచి నాకందిన సందేశం ఒక్కటే – "దేనికీ అడ్డూ అదుపూ లేని దేశమట అది. అల్లుడు బుద్ధిమంతుడే కానీ – పరిసరాలు అలాంటివి. ఇప్పటికే ఏమలవాట్లు అయ్యాయో, ఏంచేస్తున్నాడో తెలియదు. దేనికీ తెగే దాకా లాగకు. నెమ్మదిగా మంచి మాటలతో నీవైపు తిప్పుకుని దారి మళ్లించుకో"

అమ్మా నాన్నా వెళ్లేసరికే – నా పాస్‌పోర్టు కూడా వచ్చేసింది. ఆతర్వాత రిజర్వుబ్యాంకునుంచి విదేశీ మారకానికి సంబంధించిన కాగితాలు కొన్ని రావాల్సి ఉంటే – పాస్‌పోర్టు రాగానే బావ వాటిని చిటికెలమీద సంపాదించాడు.

ఢిల్లీకి టికెట్లు బుక్కయ్యాయి.

ఈలోగా బావకి నియోగి అనే బెంగాలీ అతను పరిచయమయ్యాడు. అతను కూడా మేం వెడుతున్న ఏరోఫ్లోట్ విమానంలోనే అదేరోజున మాస్కో వెడుతున్నాట్ట. నాకు తోడుగా ఉంటాడని బావ ఎంతో సంబరంగా చెప్పాడు.

నన్నూ పిల్లల్నీ తీసుకుని అక్కా బావా ఢిల్లీ వచ్చారు. విమానాశ్రయంలో కలిసిన నియోగికి నన్ను పరిచయం చేసి, "విదేశయానమే కాదు, ఒంటరిగా వెళ్లడమూ వీళ్లకి మొదటిసారి. మీరు కొంచెం సాయం చేయాలి" అని చెప్పాడు బావ.

ఆయన మాతో వచ్చేది మాస్కో దాకానేనుట. ఆ తర్వాత ఆయన వెళ్లేది జర్మనీ కాదు. మరో దేశం. అంతవరకూ చేతనైన సాయం చేస్తానని మాటిచ్చాడాయన.

సామాను తీసుకుని – నేను, పిల్లలు సెక్యూరిటీ చెక్‌కి వెళ్లేదాకా అక్క, బావ మాతోనే ఉన్నారు. వాళ్లు కనుమరుగవగానే ఆత్మీయులకు దూరమైన అనుభూతి కలిగి, కళ్లలో నీళ్లు తిరిగాయి.

మీరు దగ్గరలేరన్న వ్యథలో అక్కడుండగా పట్టించుకోలేదు కానీ – కలకత్తాలో మా అక్కాచెల్లెళ్ల ఆత్మీయానుబంధం మరింత బలపడింది.

ఉన్నట్లుండి నేను ఒంటరినైపోయాను. ఆ ఒంటరితనంలోనే – లోకం తెలియని ఇద్దరు పసివాళ్ల బాధ్యత – లోకం తెలియని నామీద పూర్తిగా పడింది.

వెడుతున్నది నాకు తెలియని కొత్త లోకానికి!

భయం భయంగానే ముందడుగు వేశాను. నాతో పాటే పిల్లల్నీ, సామాన్నీ కదపాలి కాబట్టి అడుగులు భారంగానే పడుతున్నాయి. ఆ సమయంలో ఉన్నట్లుండి సెక్యూరిటీ అలారం విపరీతంగా మ్రోగడం మొదలెట్టింది.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments